# వెన్నెలొచ్చింది

## ( హాస్యనాటిక )

- శంకరమంచి పార్థసారథి

ఇందులో వచ్చు పాత్రలు

1. వెంకటాచలం
2. సుబ్బరామయ్య
3. రావడు
4. రామలింగం
5. వెన్నెల

# వెన్నెలొచ్చింది

## ( హాస్యనాటిక )

- శంకరమంచి పార్థసారథి

**( తెరతొలిగేసరికి )**

అదో సామాన్యుడి ఇంట్లో ఒక గది. ఒక ప్రక్కన మంచం, ఇంకోవైపుగా టీపాయ్, మూడు నాలుగు కుర్చీలు, మొదలైన సామాను కనిపిస్తోంది. గోడలకి దేవుడి క్యాలెండర్లు, ఫోటోలు యెక్కువగా కనిపిస్తున్నాయ్.

రావుడు స్టేజిపై దేవుడి ఫోటోలని చేతిగుడ్డతో శుభ్రంచేసే కార్యక్రమంలో పూర్తిగా మునుగున్నాడు. వుండి వుండి నమస్కారం చేస్తున్నాడు. తిరిగి కార్యక్రమం కొనసాగిస్తుండగా, ' రావుడూ, రావుడూ ' అంటూ వినిపించింది అయినా అతడిలో మార్పు కనిపించలేదు. కొద్దిసేపటికి వెంకటాచలం స్టేజిపైకొచ్చాడు.

పంచకట్టు కట్టేడు. వుత్తరీయాన్ని నిండుగా కప్పేడు. మొహాన విభూది, కుంకుం బొట్టు, చెవిలో పూలు. పరమ నిష్టాపరుడిలాగా వున్నాడు )

చలం : రావుడూ – పిలుస్తుంటే పలికి చావవేమిరా ?

రావు : ఉలిక్కిపడి వినిపించలేదండి – పన్లో వున్నాగదండి.

చలం : ఏం పన్రా, అంత పడిపోయే పాపిష్టిపని.

రావు : అదేనండి, ఫోటోలన్నీ తుడిచి శుభ్రం చెయ్యమన్నారే – ఆ పనండి.

( వెంకటాచలం ఆ మాట వినంగానే వులిక్కిపడి, లెంపలేసుకుంటూ )

చలం : అపచారం, అపచారం, మరాసంగతి ముందే చొప్పొచ్చుగా, ఇంతకీ పూర్తయిందా ?

రావు : ఇంకో రెండు ఫోటోలున్నాయండి, ఆంజనేయులవారు అయ్యప్పగారు మిగిలిపోయారండి.

చలం : సర్లే – ఆ కాస్తా గూడా పూర్తిచేసి బజారుకెళ్ళి కొబ్బరికాయ, ఆ అరటి పళ్ళు పట్రా. నాకు పూజకు వేళయింది.

రావు : అలాగేకానిండి, బాబూ– నాకో చిన్న సందేహవండి.

చలం : ఈ దేహమున్నంతకాలం సందేహాలు తప్పవు. ఏవిటో త్వరగా చెప్పి తగులడు అవతల వర్జ్యము వచ్చేవేళయింది.

రావు : అహ – ఏంలేదండి, అసలీ ఇంట్లో నా పోస్టేవిటా ? నౌకరు సన్నాసినా ? వంట వెధవనా. మీరు రాత్రిళ్ళు చెప్పే పురాణాలు వినే బడుద్దాయినా ? అసలేవిటాని.

చలం : ఓ ! అదా నీ సందేహం. రేయ్ రావుడూ, నువ్వు గత జన్మలో నా పెళ్ళానివయి వుంటావు. అపుడు పనిపాటా చెయ్యక నన్నవస్థపెట్టుంటావ్. అందుకే ఈ జన్మలో ఇలా రుణం తీర్చుకుంటున్నావ్, అంతే.

రావు : ( భయంగా ) అలా అనకండి, ఇహ రాత్రిళ్ళు నాకు నిద్దరట్టదు.

చలం : ఏడ్చావ్, అయినా ఈ శరీరానికి సుఖం నేర్పకూడదురా – నేర్పావో ఇహ కష్టపడనని మొరాయిస్తుంది. ఆ పరమాత్ముడి సేవకై ఈ కట్టెని అరగతియ్యాల్రా.

రావు : అన్నట్లు బాబూ, రాత్రి కల్లో కనిపించారండి

చలం : ఎవరు నేనా ? పురాణం పూర్తి కాకుండానే పడుకున్నావాని కేకలేసానా ?

రావు : కల్లో కొచ్చింది మీరుగాదండి, దేవుడు గారు.

చలం : దేవుడుగారా ? ఏ దేవుడ్రా ?

రావు : అదే అర్ధంకాకుండా వుందండి. చూట్టానికి ఎర్రగా, లావుగా మంచి బందోబస్తుగా వున్నారండి. నెత్తిన కిరీటం గూడా వుందండి.

చలం : అలాగా, అయితే ఆ భద్రాద్రి రాముడే అయ్యుంటాడు. ఆయనెప్పుడూ అంతే, అసలువాడ్ని కాదని అడ్డమయిని వాళ్ళకి కనిపిస్తుంటాడు.

రావు : చేతిలో కత్తి గూడా వుందండి.

చలం : కత్తే ? అయితే ఖచ్చితంగా విష్ణుమూర్తులవారే. స్వామీ ఇదేనా న్యాయం ? పూజలు చేసేది నేనా ? కనిపించేది ఈ వెధవకా ?

రావు : ఆగండాగండి, వెనకాల తోక గూడా వుందండి.

చలం : తోకా ? నెత్తిన కిరీటం, చేతిలో కత్తేవిటి, వెనకాల తోకేవిటి, అసలు నిద్ర ఎందుకు పోయిచచ్చావ్ ? ఇంతకీ ఏవన్నాడు ?

రావు : ఆయన సంసారాలు చేసుకునే వాళ్ళకీ దేవుట్ట. పెళ్ళి పెటాకుల్లేకుండా వుండిపోయిన వాళ్ళని నరికిముక్కల్చేస్తారట.

చలం : నిజంగానా ?

రావు : మీమీద వొట్టండి, పదిరోజుల్లోపల పెళ్ళిగాని చేసుకోకపోతే నరికి పోగులుపెడతానని బెదిరించి మాయమయ్యారండి. గొప్ప దిగులుగా వుందండి.

చలం : అయితే ఇప్పుడు ఏం చేస్తానంటావ్ ?

రావు : చేసేందుకే వుందండి, ఎవత్తినో ఒకదాన్ని కట్టేసుకుని ఈ గండం లోంచి బయట పడాలనుకుంటున్నానండి.....

చలం : అర్దవైందిరా, అర్దమైంది కట్టు కధని మాంచి పట్టుగానే చెప్పేవ్. అంటే పెళ్ళి మీదికి ధ్యాస మళ్ళింది అవునా ?

రావు : చిత్తం – శివుడాజ్ఞండి. మన్దేం వుంది.

చలం : చాల్లే వూరుకో, అన్యాయం అయిపోతావ్. తర్వాత నీ ఇష్టం. రేయ్ రావుడూ – నా మాట విను. వొద్దు ఆ ఆలోచనని బుర్రలోంచి తుడిచెయ్యి. ఆడదంటే ఆటంబాంబులాంటిదని చెప్పానా ! పెళ్ళి చేసుకోవటం అంటే నీ గొయ్యిని నువ్వే ఓపిగ్గా తవ్వుకోవటం లాంటిదని చెప్పానా !

రావు : చెప్పేరనుకోండి – కాని....

చలం : కాని వుండగలనా, అనేగా నీ అనుమానం నన్ను చూసి నేర్చుకో పెళ్ళాం పోయి పాతికేళ్ళయిందా ! అయినా ఎంత నిష్టగా, నిగ్రహంగా వున్నానో చూడు. అందమైన అప్సరసరలొస్తే అవతలకి పొమ్మంటాను. రంభ ఊర్వశిలొచ్చారనుకో, డోంట్ కేరంటాను.

రావు : ఇంకోపాతికేళ్ళకి నేనూ అంటానండి. అంచేత బాబూ, ఓ పన్చెయ్యండి ఆ సత్తమ్మ కూతుర్ని వంటపనికి, ఇంటిపనికి పెట్టుకుని నాకు సెలవిప్పించండి. నేనెళ్ళి పెళ్ళి చేసుకుంటా – అదేలెండి గొయ్యితవ్వుకుంటా.

చలం : సత్తెమ్మ కూతురంటే...సన్నగా, పళ్ళెత్తుగా .. ఛ ...ఛ ...దాన్ని తగలెయ్యా, అయినా ఆడదాని చేతికూడు ఒక్క పూట తింటే సప్తజన్మల నిగ్రహశక్తిన్నూ నీళ్ళు కారిపోతుందని స్వామివారు చెప్పారు. అంచేత నువ్వెళ్ళటానికి ససేవిరా వీల్లేదంతే

( వెళ్ళిపోయేడు. రావుడు అదేవైపుగా చూస్తూ )

రావు : ఇదెక్కడి గొడవండి బాబూ, పెళ్ళి చేసుకుంటానయ్యా అంటే వీల్లేదంటాడు. వెళ్ళిపోతానయ్యా అంటే కుదరదంటాడు. జీతం డబ్బులడిగితే వ్యామోహం పనికిరాదురా అంటాడూ.

( రావుగు లోపలి గదివైపుగా రెండడుగుల వేసేడు. అప్పటికే సుబ్బరావయ్య వచ్చేడు, చేతులు కట్టుకొని, జాగ్రత్తగా రావుడి మాటలన్నిటిని వింటున్నాడు, ఇదంతా తప్పని రావుడు తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్నాడు )

నాగ్గాని తిక్క రేగిందంటే ఆ యవ్వన లేహ్యాన్ని ఏ వుప్మాలోనో కలిపి తినిపించేస్తా. ఇహనంతే – పెళ్ళి పెళ్ళంటూ వీధులు పట్టి తిరుగుతావ్.

( ఆ మాట పూర్తికాకుండానే సుబ్బరావయ్య ఒక్క అంగలా రావుడి వెనగ్గా చేరి – ఆసక్తిగా )

సుబ్బ : నిజంగానా ?

రావు : ( యధాలాపంగా ) కాక, మనిషికి కనికరంగాని, మందులకి , లేహ్యాలకి ఛస్తే వుండదు వాటి పని అవిచేసుకుపోతాయ్.

సుబ్బ : ఇంతకీ ఆ లేహ్యం ఎక్కడ దొరుకుతుంది ? డబ్బాల్లోనా ? సీసాల్లోనా, రేషన్ కార్డుమీదిస్తారా ? రేటెంత ?

( అప్పటిగ్గాని, రావుడు అంతడి రాకని గుర్తించాడు కాదు. వులిక్కిపడి )

రావు : ఎ...ఎ...ఎవరండి ?

సుబ్బ : పేరు సుబ్బరావయ్య, వూరేమో పెళ్ళాలపాలెం.

రావు : పెళ్ళాలపాలెమా ? అదెక్కడ ?

సుబ్బ : వుందిలే పిల్లలమర్రి ప్రక్కన . ఇంతకీ ఆ లేహ్యం ఎలా పుచ్చుకోవాలి ? పత్యం వుందా ?

రావు : అంటే ....ఇంకా తమకీ పెళ్ళికాలేదా ?

సుబ్బ : ఆ – ఏం అవటంలేద్దూ – ఏదో రెండుసార్లయింది.

రావు : అయితే, ఇంకోసారి చేసుకోవాలని వుద్దేశ్యంగాని వుందా ?

సుబ్బ : వుద్ధేశ్యం అయితే గట్టిగానే వుందోయ్. కాని ఓపికి బొత్తిగా లేదనుకో – మనసేమో కావాలి – కావాలంటుంది శరీరమేమో ఇహ నావల్ల కాదూ అంటోంది. అందుకే ఆ యౌవ్వన లేహ్యం నా మొహాన పారేస్తే.

రావు : ఇంకో ఛాన్సు చూస్తానంటారు. భేష్ – మీరండి మొగాళ్ళంటే – పెళ్ళి మీద పెళ్ళి లాగించేస్తున్నారు – అలా ఉండాలి.

సుబ్బ : అడగటం మర్చిపోయాను. ఏం ఫీలవకు – ఇంతకీ నీ కెన్ని పెళ్ళిళ్ళు ? వుజ్జాయింపుగా చెప్పు చాల్లె....

రావు : సర్లెండి – అసలింతవరకు శ్రీకారమే చుట్టందే మనసూ శరీరం గూడా కావాలి కావాలని ఒకటే డ్యూయెట్టు.

సుబ్బ : మరే ఏంటి ఆలస్యం ?

రావు : అదో పెద్ద కథలెండి – ఇంతకీ అడగటం మర్చిపోయాను – తమ రెవరండి ?

సుబ్బ : వెంకటాచలం వున్నాడా ?

రావు : లోపలున్నారండి.

సుబ్బ : ఆయన మావగారున్నాడా ?

రావు : లేరండి – పోయి పదేళ్ళయింది.

సుబ్బ : ఆ మావగారి తమ్ముడున్నాడా ?

రావు : తెలీదండి. బహుశా వారుకూడా ఈ పాటికి దుకాణం మూసేసుంటారండి.

సుబ్బ : ఆ దుకాణం మూసేసినాయనకి మొగుడ్ని. అంటే వెంకటాచలం మావగారి తమ్ముడికి మొగుడ్ని – అర్ధమైందా ?

రావు : కాలేదండి – తమ్ముడికి మొగుడేంటండి ! కొంపతీసి తవరి రెండు పెళ్ళిళ్ళు ఇవే బాపతా ?

సుబ్బ : తమ్ముడి మొగుడంటే – అల్లుడన్నమాట – ఇంతకీ ఆ లేహ్యం డబ్బా ఎక్కడ పెట్టేవు ?

రావు : మీరలా కూర్చోండి. అయ్యగార్ని పిల్చుకొస్తా వెళ్ళేలోపల మీకు డబ్బా ఇప్పిచ్చే పూచీ నాది. నా డబ్బా గురించి మాత్రం అడక్కండి

( సుబ్బారావు ఇల్లంతా పరీక్షగా చూస్తున్నాడు అంతట్లో లోపల్నించి వెంకటాచలాన్ని పిల్చుకొచ్చేడు )

రావు : సుబ్బారావయ్యగారని – మీ మావగారికి తమ్ముడికల్లుడు – పెళ్ళాలపాలెం నుంచి పెళ్ళి సంబంధం కోసం వచ్చారట – వెంకటాచలంగారంటే వీరేనండి – మీ

మావగారి అన్నయ్య మొగుడుగారు.

( ఇద్దరూ పరీక్షగా చూసుకున్నారు. )

చలం : మీరు – సీతాపతిగారల్లుడా .

సుబ్బ : అబ్బె – సుబ్బారావుగారల్లుడ్ని.

చలం : సుబ్బారావంటే – చల్లపల్లి సీతమ్మగారి పిన మావగారి షెడ్డకుడేగా అవునవును గుర్తొచ్చింది చాలా మంచివాడు – నన్ను చూస్తే చాలు ప్రాణం విడిచేవాడు.

సుబ్బ : అంటే – మీరాయన్ని చూసి పదేళ్ళయుండాలి.

చలం : అరె – ఆ విషయం మీకెలా తెల్సు !

సుబ్బ : ఆయన పోయిగూడా సరిగ్గా పదేళ్ళయింది ( ఇద్దరూ నవ్వుకున్నారు )

చలం : రేయ్ రావుడూ – నిన్ను తగలెయ్య అలా చూస్తూ నిలబడ్డావేరా వెళ్ళి కాఫీ పట్రా – స్నానం అదీ చేస్తారా ?

సుబ్బ : ఇదిగో నీ పేరేవిటో – ఆకలి దంచేస్తోంది.కాస్త ఏదైనా టిఫిన్ గూడా వుంటే పట్రా – ఆపైనే స్నానం.

చలం : అంటే – పూజా పునస్కారం

సుబ్బ : అబ్బే – అటువంటి ఇబ్బందులేం లేవు – మనకి తెల్సిందొకటే పూజా ముదర పూజా – ఆగరా అబ్బీ – నేనూ వస్తున్నా,

( అనేసి పెట్టే చేత్తో పుచ్చుకొని లోపలికి దారి తీసేడు రావుడు ఫాలో ఆయ్యేడు )

చలం : పాపిష్టి జన్మ – పాపిష్టి జన్మని – ఓ కృష్ణా రామా – పూజా పునస్కారం ఏవీలేవుట ఎంతసేపూ తిండి... తిండి... పురుగులుపడి చస్తాడు. అంతలో రావుడు బిక్కమొహంతో తిరగొచ్చాడు )

చలం : ఏవిట్రా అప్పుడే వడ్డనా అదీ అయిపోయింది ?

రావుడు : ఏం వడ్డనండి బాబు – లోపలికెళ్ళగానే “ వంటగదికి దారెటు ” అనడిగారండి. “ అదిగో అదే వంటగదని ” చూపించానండి – ఇహనంతేనండి. నా సంగతి నే చూసుకుంటా – నువ్వెళ్ళి ఇంకేదైనా పన్చూసుకో అన్నారండి – ఇలా వచ్చేసేనండి.

చలం : వీడ్ని తగలెయ్య. ఎన్నాళ్ళుంటాట్ట ?

రావు : ప్రోగ్రాం కాగితం ఇంకా ఇవ్వలేదండి. కాని వాటం చూస్తుంటే బాబూ పెళ్ళయ్యేదాకా వెళ్ళేట్టు లేదండి.

చలం : పెళ్ళా ? ఎవరి పెళ్ళి ?

రావు : మనక్కాదులెండి – వారిదే.

చలం : అంటే వీడికింకా పెళ్ళి కాలేదా ? మరి సుబ్బారావుగారి అల్లుడినన్నాడు.

రావు : అదో పెద్ద కథలెండి – వీరికి రెండు పెళ్ళిళ్ళయినాయినాయిటండి. మొదటి పెళ్ళాన్ని వీరొదిలేస్తే –

చలం : రెండో పెళ్ళాం వీడ్నొదిలేసింది – అంతేనా ?

రావు : ఇంకా వుందండి – ఇపుడు ముచ్చటగా మూడో ఛాన్సు చూద్దామని వచ్చారట. పని పూర్తయితే గానీ వెళ్ళరట.

చలం : ఏడవలేకపోయేడు – రేయ్ రావుడూ వాడ్ని తగలెయ్య చీకట్లో కొట్టుకు చస్తున్నాడ్రా !

రావు : పాయిఖానాలో బల్బు తెచ్చి వంటగదిలో పెట్టానండి – అంచేత గదిలో దీపం వుందండి.

చలం : నోర్ముయ్, నే చెప్పేది – అజ్ఞానం అనే చీకటి గురించి వాడికిక మనిషి జన్మరాదురా.....

రావు : పోన్లెండి – వారు కనీసం ఈ జన్మలోనైనా సుఖపడుతున్నారు మన బతుకులకది గూడా లేదుగా.

చలం : పొరపాటు. అది సుఖం కాదు. నరకం నిగ్రహశక్తి లేనివాళ్ళు నరకాన పడిపోతారన్చెప్పి ఎన్ని సార్లు చెప్పలేదూ – నన్ను చూడు.

రావు : గుర్తుందండి. అప్పరసలొస్తే అవతలకి పొమ్మంటారు – వాళ్ళమ్మలొస్తే డోంట్ కేరంటారు

చలం : గుర్తుంది కదా. అదీ ఈ వెంకటాచలవంటే

( అంతలో సుబ్బరావయ్య చేతులు తుడుచుకుంటూ వచ్చేడు )

సుబ్బ : ఉప్మా బావుందోయ్ – కాకపోతే మరీ దేవుడికి నైవేద్యం పెట్టినట్లు కాస్తే చేసావ్. ఇదిగో ఇక్కడ నేవున్న నాలుగు నెలలు ఎక్కువ చేస్తుండు అన్నట్లు వుప్పుకారం గూడా కాస్తా గట్టిగా తగిలించు.

చలం : ఈ కొంపలో పద్దతులేవేరు. నిన్ను తగలెయ్య చెప్పవేం.

రావు : చిత్తం - బాబూ. వుప్పుకారం తింటే కామోద్రేకాలొస్తాయని వాటినొదిలేసాం పాలు, మీగడ, నెయ్యి వగైరాలు పుచ్చుకుంటే వొళ్ళు కొవ్వెక్కుతుందని వాటినీ వొదిలేసాం ఇహపోతే - పులుపు, తీపి తింటే -

సుబ్బ : మాయరోగం వస్తుందని వాటిని వదిలేసారు - అంతేనా ?

రావు : అంతేనండి.

సుబ్బ : అయితే ఇంతకీ మీధారకం ఏవిటో ?

రావు : ఆకుకూరలు, ఉడకబెట్టిన కూరలు, నీళ్ళ మజ్జిగ బాబూ. మీరు ఓ పదిరోజులు ఇక్కడున్నారంటే - ఇంకో పెళ్ళి దేవుడెరుగు అసలు ఆడదంటే అసహ్యం పుట్టేస్తుందండి.

సుబ్బ : అమ్మో - ఈ తిండి తింటూ నేవుండలేనుగాని-

రావు : పెట్టె తెమ్మంటారా ?

సుబ్బ : దూకుడొద్దురా అబ్బీ - నా వంట నే వండుకుంటాగాని. కావాల్సిన ఏర్పాటు చెయ్యి.

రావు : అలాగేనండి ( లోపలికి వెళ్ళబోయేడు )

చలం : ముందు బజారెళ్ళి నేచెప్పినవన్నీ పట్రా - అవతల పూజకి వేళయింది ( 5 రూ॥ల నోటు ఇస్తాడు )

సుబ్బ : నాయనా రావుడూ - చిల్లరేవైనా మిగుల్తుందా ?

నరావు : అటువంటి ప్రమాదం ఏం వుండదండి - అయినా దేనికండి ?

సుబ్బ : అహ - ఏం లేదు - వచ్చేటప్పుడు పకోడీ లేవన్నా తెస్తావేమోనని.

చలం : వాడెళ్ళేది పూజా సామాగ్రి కోసం ?

సుబ్బ : నేచెప్పేది కూడా పూజా సామాగ్రి గురించేలేరా ?

చలం : ఆ...!

రావు : బాబూ తమరెళ్ళి పూజకానిస్తుండండి, వెళ్ళండి ( వెంకటాచలం విసుగ్గా వెళ్ళిపోయేడు )

సుబ్బ : ఇదిగో, రేయ్ సుబ్బడూ....

రావు : నా పేరు సుబ్బుడు కాదండి, రావుడండి.

సుబ్బ : సరే ....ఏదో ఒకట్లేగాని, ఈ రూపాయి తీసికెళ్ళీ ఓ ప్లేటిడ్లీ, కారప్పొడి, నెయ్యా వేయించి పట్రా, డబ్బులు మిగిల్తే, ఆ మిగుల్తాయిలే – ఓ సినిమా పత్రిక పట్రా.

( రావుడు అతడిచ్చిన నోటుని పరీక్షగా చూస్తూ ...)

రావు : బాబూ, ఈ బుజ్జిముండనెక్కడో చూసినట్లుందండి

సుబ్బ : ( విసుగ్గా ) దిక్కుమాలిన అనుమానాలు నువ్వూనూ, లోపల దేవుడి గూట్లో చూసుంటావులేగాని, మంచి మార్నింగ్ షో లేవన్నా ఉన్నాయా, తెలుగువి కావు, మళయాళమో, ఇంగ్లీషో.

రావు : అంటే, ఈ రూపాయిలో మార్నింగ్‌షోకి టిక్కెట్టు గూడా తెమ్మంటారా ?

పుబ్బ : వొద్దులే , అయినా నా పిచ్చిగాని, సినిమాల్లో ఏం ఉంటుంది, వాటి కన్నా తెలుగు వీక్లీలే బెటరు. సర్లే వెళ్ళిరా.

రావు : అలాగేనండి, బాబూ ఇన్నాళ్ళు యావమనిషి న్నేనే ననుకున్నానండి కాని మీ ముందు నే దిగతుడుపేనండి.

( రావుడెళ్ళిపోయేడు, సుబ్బరావయ్య ఆ వైపుగా చూస్తూ )

సుబ్బ : ఈ వయస్సులో గూడా యావని జారిపోకుండా కాపాడుకొస్తున్నానంటే మాటలు కాదు. అయినా ఇప్పుడిప్పుడే ఏవిటో విసుగ్గా ఉంటోంది. అందుకే ఆ లేహ్యం ఎక్కడ దాచేశాడో తెలిస్తే –

( వెనక్కి తిరిగేసరికి రావుడక్కడే ఉన్నాడు )

రావు : నాకు తెలుసండి కొంపముంచుతారని. నా డబ్బా జోలికి పోకండి పుణ్యం వుంటుంది. అయినా ఓపికల్లేని ఈ కాలంకుర్ర వెధవలగ్గాని, కంచు విగ్రహంలా ఉన్నారు మీకెందుకండి లేహ్యాలూ, మాత్రల్లూనూ !

సుబ్బ : అంతేనంటావా, సరే అయితే వెళ్ళిరాపో.

రావు : ( వెళ్ళిపోతూ ) బాబూ, ఆ డబ్బా జోలికి మాత్రం వెళ్ళకండి. మీ మీదొట్టు , మీ యావమీదవొట్టు. తర్వాత మీ ఇష్టం

సుబ్బ : వీడినోరు పడిపోను – ఎంతమాటన్నాడు. వెంటనే దిష్టి తీసేసుకోవాలి.

( అనుకుంటూ లోనికి వెళ్ళబోయి, రామలింగాన్ని చూసి గతుక్కు మన్నాడు. రామలింగము చాలా భక్తిగా, చేతులు కట్టుకుని నిల్చునున్నాడు )

నమ్మకం కుదరక వీడ్ని నాగ్గాని కాపలా ఉంచేడా ! ( స్వాగతం )

( రామలింగం చాలా నమ్రతగా  అన్నాడు )

రావు : అంటే  తమరు చార్లస్సంత గొప్పోళ్ళన్నమాట.

నమస్తే సార్ – నా పేరు  రామలింగవండి, మా నాన్న పేరు సోమలింగవండి, అసలు మాది  అమలాపురవండి....

సుబ్బ : పేర్లు ముచ్చటగా  వున్నాయిరా, సరే అసలు విషయం చెప్పు.

రామ : అలాగేనండి. కాని మధ్యలో ఆపకండి. మొదట్నించి  చెప్పాల్సివుంటుంది.  అది నా వీక్నెస్సండి. నా పేరు  రామలింగవండి – మా నాన్న పేరు సోవలింగవండి, అసలు మాది అమలాపురవండి....

సుబ్బ : ఆ విషయం ఇప్పటికి రెండుసార్లు  చెప్పావ్,... అసలు సంగతి చెప్పు – నేవెళ్ళి దిష్టి తీసుకోవాలి,

రామ : అయ్యో మళ్ళీ ఆ పేరా – మళ్ళీ చెప్తానండి – తప్పదండి. అది నా వీక్నెస్సండి, నా పేరు రామలింగవండి.....

సుబ్బ : నీ అయ్యపేరు సోమలింగం, మీ వూరు రావులపాలెం  అయితే ?

రామ: చూసేరా, చూసేరా !  ఎంత తప్పుగా  చెప్పేరో – మాది రావులపాలెం కాదండి, రావులపాలెం నుంచి అరవైకిలోమీటర్ల దూరంలో  వున్న అమలాపురవండి .... ప్రతిగంటకి బస్సుందండి, పిన్కోడ్ నెంబరు....

సుబ్బ : ఒరే, నీయమ్మ కడుపు బంగారంకాను విషయం  తెవల్చరా, నిజంగా దిష్టి తగిలిందో ఏంపాడో బలహీనంగా ఉంది.

రామ : మధ్యలో దూసుకురాకండి , నన్ను చెప్పనివ్వండి. నా పేరు రామలింగవండి....

సుబ్బ : మళ్ళీ వంశవృక్షం  చెప్పావంటే  పీకనొక్కేస్తానంతే

( అంటూ రామలింగం నోటిని  గట్టిగా మూసేడు.  సరిగ్గా అదే సమయానికి వెంకటాచలం  లోపల్నించి వచ్చేడు )

చలం : అయ్యో, అయ్యో  ఉప్పుకారాలు తెగతింటే  ఏమౌతుంది. ఇదిగో  ఇలా పోస్టువాళ్ళమీద, పాల వాళ్ళమీద చెయ్యి  చేసుకోవాలనిపిస్తుంది.  ఏరా రామలింగం ప్రొద్దున్నే ఇలా వచ్చావ్ ? ఉత్తరముగాని  ఉందా ?

సుబ్బ : పోస్టుపక్షివా ? చందాలకోసము వచ్చాడేమోనని !

రామ : ఇదిగోనండి మీ ఉత్తరం – బాబూ  ఈ చార్లెస్సెవరండి !

( వెంకటాచలం  ఉత్తరం చించుతూ, యధాలాపంగా )

చలం : చార్లుస్సూకాదు, సుల్తానూకాదు, సుబ్బరావయ్యని  మా దూరపు బంధువు, అబ్బో చాలా గొప్పవాడ్లే

( అనేసి ఉత్తరం చదవటంలో మునిగిపోయాడు.  రామలింగము నిల్చున్న చోట్నించే విష్ చేసేడు. తనవైపుగా రావటం గమనించే సుబ్బారావయ్య  ఆందోళనగా భయంగా మొహం పెట్టేడు )

రామ : అనుకున్నానండి మనిషిని చూడంగానే అనుకున్నా చాలా గొప్పవాళ్ళయివుంటారని మీరచ్చు  మా ఇంటిప్రక్క విశాలాక్షి ఉంది చూసేరూ !

సుబ్బ : అబ్బే చూడందే – పెళ్లయ్యిందా ?

రామ : ఆవిడ ఉంచుకున్న  మొగుళ్ళాగే ఉన్నారండి.  ఆయనగూడా మీలాగే చాలా గొప్పవార్లెండి. కార్దిస్తే అయిదు, కవరిస్తే పదీ ఇచ్చేవారండి. ఆయన పేరు రామనాధవండి. వాళ్ళ  నాన్నపేరు  జగన్నాధవండి – వాళ్ళదసలూ...

సుబ్బ :  ఆపెయి, నీ మొహం  మండిపోను,  పలకరిస్తే  జన్మనక్షత్రంతో  సహా మొదలుపెడతావు గదా,  ఒరే నీ పేరేవిట్రా అన్నావ్.

రామ : నా పేరు  రామలింగడవండి,  మా నాన్న పేరు...

సుబ్బ : నేనడిగింది నీ వొక్కడి పేరేరా !

రామ : అయినా మొత్తం  మొదట్నించి  చెప్పటం నా అలవాటండి అది నా వీక్నెస్సండి నా పేరు  రామలింగవండి...

( సుబ్బరావయ్య మళ్ళీ అతడి నోరు నొక్కేడు. రామలింగం  విడిపించుకునే ప్రయత్నం చేస్తూనే, వెంకటాచలం  ఫ్రీజయిపోయిన  సంగతి గుర్తించి, ఆ విషయాన్ని సుబ్బరావయ్యకి  చెప్పాలని  ప్రయత్నిస్తున్నాడు. కాని అతడు దాన్ని  మరోలా అర్ధం చేసుకుని )

సుబ్బ : వొదల్ను, ఛస్తే వొదల్ను, నీ వంశవృక్షం  చెప్పి నా బుర్ర  తినేస్తావ్ అయినా  ఇలా ప్రతి కొంపదగ్గర మీటింగు  పెట్టుకుంటూ పోతే ఇవన్నీ  పంచటానికెన్నేళ్ళు పడుతుంది ?

( తర్వాత రామలింగం సూచన ప్రకారం అటువైపుగా చూసి  షాకయ్యి,
రామలింగాన్ని వదిలేస్తూ )

సుబ్బ : అదేవిటయ్యా, ఉత్తరం  చదివి అలా అయిపోయేదు ?

రామ : అదే అర్థం కాకుండా ఉందండి. కొంపతీసి....

సుబ్బ : ఆ !....

( ఇద్దరూ  చలాన్ని సమీపించి, చెరోవైపు  నిల్చుని, ఆశ్చర్యంగా పరీక్షగా చూసేరు. చలం అలాగే ఫ్రీజయ్యి ఆకాశంలోకి పరవశంగా చూస్తున్నాడు.  సుబ్బరావయ్య అతడి చేతిలోని ఉత్తరాన్ని తీసుకుని చదివేడు )

సుబ్బ : అమ్మా ! ఇదా విషయం.

రాము : కొంపతీసి చావుకబురా ?

( సుబ్బరావయ్య  ఉత్తరాన్ని  తిరిగి చలం చేతిలో  ఇరికించేడు )

సుబ్బ : చావు కబురు  కాదయ్యా – చల్లటి కబురు  నీకసలు ఎంతిచ్చినా  రుణం తీరదు .

( అంటూ వెంకటాచలాన్ని  పట్టి కుదిపేడు. అతడు నిద్రలోంచి  లేచినట్లు తెప్పరిల్లి )

చలం :  నేనెక్కడున్నాను – నాకేమైంది ?

సుబ్బ :  అబ్బే  ఏంకాలేదు – ఆ వుత్తరం  చదివి  కాస్సేపు  అపస్మారకంలో పడ్డారు. ఇంతకీ  ఆ ఉత్తరం  ఎక్కడ్నించో ?

చలం : అదా – అదీ – ( రామలింగాన్ని చూసి )  నువ్వింకా  ఇక్కడే ఉన్నావా  ? వెళ్ళి పన్చూసుకో.

రాము : అలాగేనండి  – బాబూ అదేదో అన్నారు పేర్లెందుకులెండి.  రోజులసలే బాగా లేవు – ఆ కాస్తా ఇప్పించేస్తే.

చలం : ఏమిటది ?

సుబ్బ : అదేలెండి –  మామూలు కావాలట. ఏదో  నీ సంతోషం కొద్ది  వాడి  మొహాన పదో పరకో పారేస్తే.

చలం : నా ఉత్తరం  నాకిచ్చినందుకు  మామూలెందుకివ్వాలిట. వీల్లేదు. అసలే నాకు ఎదర బోల్డంత  ఖర్చుంది.

సుబ్బ : ఇదిగో చూడ్నాయనా – నీ పేరేవిటన్నావ్ ?

రావు : నా పేరు రామలింగవండి – నాన్నగారి పేరు....

సుబ్బ : ఆపెయ్ – నీ మొహం తగలెయ్య – విన్నావుగా అన్నగారి మాట చెయ్యి విదిలించేరకం కాదు. అంచేత ఇంకో ఇల్లు చూసుకో పో వెళ్ళు.

( అని అతడ్ని బయటకి గెంటేడు వాడు మళ్ళీ రివ్వున తిరిగొచ్చి

రావు : సరే అన్నగార్ని అలాగే వదిలేద్దాం – కాని వారి ఉత్తరం మీరు చదివేరుగదా పోనీ ఆ విషయం చెప్పానంటే ఏవన్నా పన్జరుగుతుందంంటారా ?

( ఆ మాటకి ఉలిక్కి పడి, జేబులోంచి డబ్బులు తీసి వాడిచేతిలో కుక్కి, రహస్యంగా )

సుబ్బ : సోమలింగం – ఇహ నాక్కనిపించక – నీకో దణ్ణం – వెళ్ళిరా.

రావు : సోమలింగం నా పేరు కాదండి – మా నాన్న గారిదండి నా పేరు రామలింగవండి – మా నాన్న పేరు –

( మాట పూర్తి కాకుండానే వాడ్ని బయటికి నెట్టేశాడు. వెంకటాచలం ఉత్తరం మళ్ళీ మళ్ళీ చదివి మురిసిపోతున్నాడు )

సుబ్బ : ఏవిటో – జీవితం చాలా చిత్రమైంది సుమా – ఏ క్షణానికేం జరుగుతుందో చెప్పలేంగదా !

చలం : అవునవును. అక్షరాలా నిజం ఇంతకీ ఏం జరిగింది ?

సుబ్బ : ఉదయం మీ ఇంటికొస్తుంటే – వీధిలో ఒకావిడా – అచ్చుగుద్దినట్లు మా మరదల్లాగే ఉందనుకో – అసలు అదే అనుకున్నా – అయినా మనపిచ్చిగాని, చచ్చినవాళ్ళు తిరిగొస్తారా – ఎన్నన్నా చెప్పరా అన్నాయ్ – మరదలంటూ లేనివాడు అసలు మనిషి కాదంటాను అవునూ – ఇంతకీ ?

చలం : మరదలుందానేగా ! ఉంది బ్రతికే వుంది. నేనంటే ప్రాణం పెడుతుంది గూడా.

సుబ్బ : ఎంతదృష్టం – ఎంతదృష్టం. అలా ఉండాలి మరదలంటే. ఎప్పుడన్నా వస్తుంటుందా చూట్టానికి !

చలం : అయ్యో ఎందకు రాదు – నిజానికి ఇదిగో ఈ ఉత్తరం అదే వ్రాసింది ‘ వచ్చేస్తున్నానూ ’ అని.

సుబ్బ : అందుకా అపస్మారకంలో పడ్డావ్ – పెళ్ళయిందా ! పిల్ల బావుంటుందా ?

చలం : ఇదిగో – నా మరదలు గురించి మళ్ళీ మళ్ళీ అడిగితే నాక్కోపం వస్తుంది. పెళ్ళికాకపోతే నేం ? దానికేం తక్కువని – ఎవరూ దొరక్కపోతే అక్క మొగుడే గతని.

సుబ్బ : దొరక్కుండా ఎందుకు పోతార్లే – దేశమేవన్నా గొడ్డు పోయిందా అయినా అదేవిటో ఒక్కోసారి కళ్ళ ముందున్న సంబంధాలు గూడా కనబడిచావవ్.

చలం : ఇదిగో మళ్ళీ మళ్ళీ అపశకునం మాటలు మాట్లాడకు నాక్కోపం వస్తుంది ( అనేసి విసురుగా వెళ్ళిపోయేడు )

సుబ్బ : పెళ్ళి కావాల్సిన పిల్ల వచ్చిపడుతోంది, అదృష్టం బావుంటే పనిక్కడే పూర్తి కావచ్చు. ఈ లోపలే ఆ లేహ్యం డబ్బా ఎక్కడ దాచేడో తెలిస్తే బావుండు – గోలీకాయంత మింగి గోపాలుడ్నయి పోనూ ?

( సరిగ్గా అదే సమయానికి రావుడు బజార్నుంచి వచ్చేడు. చేతిలో కొబ్బరికాయ, అరటిపళ్ళు ఉన్నాయి చివరిమాట విని కంగుతిని )

రావు : వంటగది గూట్లో ఆ డబ్బా చూసేసారా ? అయినా అదేం అలవాటండి – పరాయింటికొచ్చి ఓ పక్కన కూర్చోవాలిగాని. చీపురు కట్టల్లే గదులన్నీ తిరక్కూడదండీ – ( స్వగతం )

సుబ్బ : ( మెల్లిగా ) అమ్మనీ మొహం ఈడ్చ – వంటగది గూట్లో ఉందా ? విషయం ( పెద్దగా ) అబ్బే నే చూడ్లేదురా అబ్బీ – దిగులు పడగ్గాని ఇడ్లీ తెచ్చావా ? చిల్లరేవైనా మిగిలిందా ?

రావు : ఏం చిల్లరండి బాబూ – మీరిచ్చిన ఆ రూపాయి గూడా పూజా సామాగ్రిలో పడిపోయింది ధరలు ఆకాశంలో గదండీ ఉన్నాయి. ఆలస్యం అయిందని లోపల అగ్గి రావుడయిపోతుంటాడు. ఇచ్చేసొస్తా వుండండి...

సుబ్బ : ఇదిగో – త్వరగా వెళ్ళి అంతకంటే త్వరగా రా – నీకో గొప్ప సంగతి చెప్పాలి.

రావు : ఏం సంగతండి ?

సుబ్బ : మీ అయ్యగారి మరదలొస్తోంది రా – ఇంకా పెళ్ళి కాలేదంట – పేరేమో శ్యామలట.

రావు : అయ్యగారి మరదలా ?

సుబ్బ : అవున్రా – ఏమిటలా నోరు తెరిచేవ్ పెళ్ళయిన ప్రతి వెధవకి ఓ మరదలుంటుంది. నీక్కూడా మరదలు కావాలంటే వెంటనే పెళ్ళి చేసుకునేడు.

రావు : అంటే – పెళ్ళి చేసుకునేది పెళ్ళాంకోసం కాదన్నమాట.

సుబ్బ : ఆ పెళ్ళాందేవుందిరా ఓ పక్కన పడుంటుంది. కాని మరదలనేది మత్తు పదార్ధం లాంటిది. దాన్లో ఉన్న కిక్కు నీకేం తెల్సు ?

రావు : అలాగా ?

సుబ్బ : పెళ్ళాం ' భోజనానికి రండీ ' అంటూ పిల్చిందనుకో – అబ్బే చప్పగా ఉంటుంది. ' ఆకల్లేదూ అవతలికి పో ' అనాలనిపిస్తుంది. అదే మరదలు ' భోజనానికి రా బావ ? వడ్డించానూ ' అందనుకో – దాన్దుంపతెగ – ఎంత ముచ్చటగా ఉంటుందిరా – ఏవిట్రా అలా అయిపోయావ్ !

రావు : నాకిప్పుడు రెండు అనుమానాలొచ్చేయండీ.

సుబ్బ : ఏవిటది ?

రావు : మొదటిది – అసలు మా అయ్యగారికి మరదలెక్కడ్నించి వచ్చిందాని.

సుబ్బ : అంటే ....

రావు : అసలీయనకి నాకు తెల్సి మరదళ్ళు లేరండి. ఆయన మావగార్కి ఒక్కర్తే ఆడపిల్ల.

సుబ్బ : అలాగా – కాని ఉత్తరం వచ్చిన మాట నిజం నా కళ్ళతో నే చూసా.

రావు : అంటే – కొంపతీసి చదివారు గూడానా ? ఏం రాసింది !

సబ్బ : మళ్ళీ ఎవరితో అనబోకు గాని – అదేవిటో మొగుడూ పెళ్ళాలు, బావామరదళ్ళు, ప్రేయసీ ప్రియులు – వీళ్ళు రాసుకున్న ఉత్తరాలని, ఒక్కసారి.... ఒక్కసారి అలా చూస్తేచాలు – జిరాక్సు తీసినట్లు గుర్తిండిపోతాయనుకో.

రావు : అలాగా – అయితే ఇంతకీ.

సుబ్బ : అదే చెప్తుంట – ఇన్ లాండ్ కవరు అఓరాలు ముత్యాల్లాగా ఉన్నాయి.... ఏం వ్రాసిందంటే – బావా ! ఏవిటి ఆశ్చర్యంగా ఉందా – అవున్లే నీకన్నీ ఆశ్చర్యాలే, ఎంత సేపూ నీ వ్యవహారాలు నీవేగాని, నా గురించేవన్నీ ఆలోచించేవా ! అసలు నేనంటూ ఒకదాన్ని లేనట్లు ప్రవర్తిస్తున్నావ్. నీ గురించి నేనెంతగా అనుకుంటున్నానో నీకేం తెల్సు ! ఎప్పుడూ నీ ధ్యాసే. రాత్రి పూటయితే – ఛీ – నాకు సిగ్గేస్తోంది బాబూ !

రావు : మీకు సిగ్గేంటండి ?

సుబ్బ : నీ బొంద - నాక్కాదు - ఆ పిల్లకీ - ఇంకా వుంది విను - ఈ బాధ నే పడ్లేను బాబూ - అంచేత ఆరో తారీఖున బయల్దేరి వచ్చేస్తున్నా - ఇహ నా భారం నీదే సుమా - ఉంటా మరి - ఇట్లు - శ్యామల

రావు : ఎక్కం అప్పచెప్పినట్లు మా బాగా చెప్పారండి. కాని ఇందులో ఏదో తిరకాసుందండి.

సుబ్బ : అంటే ?

రావు : చెప్పాగదండి - ఆయనకి మరదళ్ళు లేరని....

సుబ్బ : అదా - దాందేం ఉందిలే, వాళ్ళ మావగారు కూతుర్ని కాపరానికి పంపించి . పనిగట్టుకుని ఇంకో కూతుర్ని కనుంటాడు. రాకపోకలు లేకపోవటం చేత ఆ విషయం వీడికి తెల్సుండదు.

రావు : సరే అదలా ఉంచండి. ఇహ రెండో అనుమానం, ఆవచ్చేది ఆయన మరదలు గదా - కాని మీరేవిటి సొంత మరదలొస్తున్నట్లుగా మెలికలు తిరిగి, ముచ్చటపడి పోతున్నారు ?

సుబ్బ : అదా - వాడి మరదలేవిటి, నా మరదలేవిటి ! మరదలంటే మరదలే - అయినా ఆ పిల్లకి పెళ్ళి కావాలి సరే. నాకూ ఎలాగూ ఆ ఉద్దేశ్యం ఉందిగదా - మీ అయ్యగారి చేతిమీదుగా ఏదో ఆ శుభకార్యం కాస్తా జరిగిపోతే ....

( అంతలో లోపల్నించి పిలుపు వినిపించగా రావుడు వెళ్ళబోయేడు. సుబ్బరావయ్య అతడి చేతుల్లోంచి అరటిపండు తీసుకున్నాడు )

రావు : మాటల్లో పెట్టి ఎన్ని మాయం చేసారు. ఆ పండక్కడ పెట్టండి ఆయన్తో లెక్క లెక్కేనండి - తోలువలిచేస్తాడు.

సుబ్బ : మరదలు వస్తున్న సంతోషంలో ఉన్నాడు. పట్టించుకోడు. ఒక వేళ అడిగితే - వీధిలో ఆవుకు పెట్టానని చెప్పు.

( రావుడు గొణుక్కుంటూ వెళ్ళిపోయేడు )

( సుబ్బరావయ్య దేవుడి ఫోటోకి చేతులు జోడించి )

సుబ్బ : కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదని - నేనిక్కడికి రావటం ఏవిటి ! వాడిక్కాడా

తెలీని  వాడి మరదలు వస్తున్నానంటూ ఉత్తరం రాయటం ఏవిటి ? పైగా ఆ పిల్లకింకా  పెళ్ళికాకపోవటం ఏవిటి ? ఎక్కడ  ఓపిక  లేక అశ్రద్ధ చేస్తానో  అని వంటగదిలో ఆ లేహ్యాన్ని  అమర్చటం  – నువ్వున్నావయ్యా, నిజంగా ఉన్నావ్ – సందేహం లేదు

( సుబ్బరావయ్య బహుశా అరటిపళ్ళు  తింటున్నాడు – లోపలికెళ్ళిన  రావుడు వెనక చూపులు చూసుకుంటూ వచ్చేడు )

సుబ్బ : ఏవిట్రా – అలా వెనక్కి చూసుకుంటూ  వస్తున్నావ్ – మళ్ళీ బజారు  పనా !

రావు : గొప్ప విచిత్రవండి – నా కళ్ళన్నే నమ్మలేకపోతున్నానండి.

సుబ్బ: అంటే పూలు పళ్ళు  లేకుండానే  పూజా లాగించేసాడా ?

రావు : ఇంకెక్కడి పూజండి – అయిపోయింది.  అంతా అయిపోయింది నే వెళ్ళి బాబూ – ఇదిగో  అరటిపళ్ళూ అన – వీధిలో ఆవుకు పెట్టూ అన్నారండి.

సుబ్బ : అంటే – నాకు పెట్టమనా వాడుద్దేశ్యం.

రావు : అయ్యుండచ్చు –  ఇదిగో బాబూ  కొబ్బరికాయా అంటే – పగలగొట్టి పచ్చడి చెయ్యీ అన్నారండి.

సుబ్బ : ఏవిటీ – కొబ్బరిపచ్చడే – బ్రహ్మాండం కొబ్బరిపచ్చడంటే నాకు  చచ్చేటంత ఇష్టం. ఉప్పుకారం మాత్రం గట్టిగా  తగిలించు.

రావు : మీ పచ్చడి పాడుగానూ – నా బాధ  అదికాదండి రేపట్నుంచి పూజలూ పునస్కారాలూ బంద్‌ట  గుళ్ళూ గోపురాలు అంటే – ఆ దేవుడెక్కడలేడ్లె అంటున్నారు. పైగా బజారెళ్ళి పౌడరు డబ్బా సెంటుసీసా,  మల్లెపూలు తెమ్మంటున్నారు.

సుబ్బ : అంటున్నాడా – అంటే ఇప్పటికి తెల్సుకున్నాడన్నమాట – నాకేం కావాలో చూసేవా మరదల్ని  చేసుకుంటాననేసరికి  మర్యాద  ఎలా పెరిగిపోయిందో ! కొబ్బరిపచ్చడితో  భోజనం – సెంటు, మల్లెపూలు ….భేష్ – ఇదిగో  చూడు – పన్నీరు గూడా దొరుకుతుందేమో ప్రయత్నించు  దాంట్లో ఉండే సరదా, ఆనందం దాంట్లోనే ఉంది. నీకు తెలీదులే.

రావు : నా బుర్ర గిర్రున  తిరుగుతోందండి. మనుషులందరికి  వెనకాలతోకలు కనిపిస్తున్నాయండి.

సుబ్బ : నీ మాటలు వింటూ కూర్చోవటానికి నాకాట్టే టైం లేదు. ముందు స్నానం చెయ్యాలి. అంతకంటే ముఖ్యమైన పనోకటుంది వస్తా....

( సుబ్బరావయ్య వెళ్ళి పోయేడు )

రావు : ఉత్తరానికి వీళ్ళిద్దరూ జెండా తిప్పేసారే – సాక్షాత్తు ఆ పిల్లగాని వస్తే –

( అతడిమాట పూర్తి కాకుండానే వెన్నెల కంగారుగా లోనికొచ్చింది. భయంగా తలుపు ప్రక్కగా వొంగి నిల్చుని, వీధిలోకి ఆత్రంగా చూస్తోంది – రావుడు అర్ధం కానట్లు ఓ క్షణం చూసి )

రావు : ఏయ్ – ఎవర్నువ్వు – ఏం కావాలి .

వెన్నెల : నేను...నేను...

రావు : నీ గురించే అడుగుతుంట. ఏం కావాలి.

వెన్నెల : అబ్బే – నాకేం అక్కర్లేదు.

రావు : అంటే – పలకరించటానికొచ్చేవా ! నడు బయటికి

వెన్నెల : అలాగే వెళ్ళిపోతా. కాని కాస్సేపు ఉండనివ్వండి. కనీసం బయట ఆ రాబందులు వెళ్ళే దాకా.

రావు : రాబందులా . అంటే !

వెన్నెల : ఏం చెప్పను ( ఏడ్చింది )

రావు : ఇంతకీ నీ పేరు ?

వెన్నెల : పేరుతో పనేం ఉంది ? నేనో దగాపడ్డ ఆడదాన్ని. బ్రతుకుతెరువు కోసం ఈ వూరొస్తే ఉద్యోగం ఇప్పిస్తానని, నమ్మించి , నాకు తెలీకుండానే నన్ను అమ్మేసాడు. ఆ ఇంట్లోంచి పారిపోయి వస్తుంటే

రావు : ఆ మనుషులు వెంబడిస్తే, తలదాచుకోవటనికిలా వచ్చేవ్. అంతేనా ! అంటే – నీకు నా అనేవాళ్ళెవరూ లేరా ?

వెన్నెల : ఉన్నా లేనట్లే లెక్క. అంతకు మించి ఇంకేం అడక్కండి – ప్లీజ్.

( అంతలో లోపల్నించి రావుడూ వెంకటాచలం పిలుపు వినిపించింది. ఆ పైన మనుషులొస్తున్న సందడి )

రావు : ఇదిగో చూడు. నువ్విక్కడుండాలంటే నాదో సలహా.

వెన్నెల : ఏమిటి !

రావు : ఇక్కడున్నంతసేపూ నీ పేరు శ్యామల అలా చెప్పావంటే ఎన్నాళ్ళయినా ఉండొచ్చు.

వెన్నెల : శ్యామలా ? కాని...కాని...నా పేరు ...!

రావు : ఇంకేం చెప్పొద్దు – బయటికెళ్ళి దగా పడటంటకన్నా, చిన్న అబద్ధం ఆడి, జీవితాన్ని కాపాడుకోవటం నయం అంచేత నే చెప్పినట్లు చెయ్యి – నీకే ఆపదా రాదు.

( అతడి మాట పూర్తికాకుండానే వెంకటాచలం అక్కడికొచ్చేడు ఇపుడు ప్యాంటు షర్టు వేసుకున్నాడు, క్రాఫింగు దువ్వేడు, చేతిలో సిగరెట్టు గూడా ఉంది )

చలం : నిన్ను తగలెయ్య – గొంతు చించుకుంటే పలికిచావవేరా ? ఎవరా వచ్చింది ?

రావు : ఆ పిల్లా... అదేనండి...ఎవరో శ్యామలట – అడ్రస్సేమో మీదే చెప్తోందిగాని, నమ్మకం కుదరక నిలేసాను.

చలం : అగోరించలేకపోయావ్ – నేననుకుంటూనే ఉన్నా –శ్యామలంటే నా మరదల్రా.

రావు : అలాగండీ – మరి మాట వరసుకు కూడా ఎప్పుడూ చెప్పలేదేమనండి – ఇలా రండమ్మా....

చలం : అదేవిటి శ్యామూ – పరాయింటికొచ్చినట్లు నిలబడే వున్నావ్ – దా ఇలా వచ్చి కూర్చో ( ఆమెను ముట్టుకోబోయేడు )

రావు : బాబూ – ఆడదాన్ని పాదాలపైన చూడకూడదని చెప్పినట్లు గుర్తండి.

చలం : వొదిలెయ్యి – అసలు పరమార్ధమంతా పాదాలపైనే గదరా ఉంది – నువ్వెళ్ళి స్నానాకి నీళ్ళు పడెయ్యి

నువ్వేం అనుకోకు శ్యామ్. ఈ వెధవకి చచ్చు అనుమానాలు జాస్తి. అయ్యో , నిన్ను నిల్చోపెట్టే మాట్లాడేస్తున్నా, ఇలారా ! ( చెయ్యి అందిచ్చి పుచ్చుకోబోగా, ఆమె దూరంగా జరిగి )

వెన్నెల : అసలు నేను...నా పేరూ.... !

చలం : చాల్లే వూరుకో – కొత్తవాళ్ళకి చెప్పినట్లు పేర్లు గోత్రాలు దేనికీ ? నేనేం పరాయివాడ్నా ! అక్కయ్య మొగుడ్ని. అంటే నీ మంచి చెడ్డలు చూసుకోవాల్సినవాడ్ని ఇహనించి ఈ ఇల్లు నీదే శ్యామూ, వీడు రావుడని వంటమనిషి.....

రావు : నౌకర్ని , వగైరాగాడ్ని గూడాలెండి. బాబూ... ఆడదాన్ని నమ్మకూడదన్నారు గదా – అన్యాయం అయిపోదాం అన్నారుగదా, మరి మరదల్ని ....?

చలం : నమ్మొచ్చు, దోషం లేదు, లోపలికి తగులదు – ఏవిటో శ్యామూ, చెబితే నమ్మవుగాని, ఇన్నేళ్ళూ ఎలా బ్రతికేనో అనిపిస్తుంది. కాని ఎందుకు బ్రతికేనో ఇప్పుడే అర్థమయింది. నువ్ రాసిన ఆ వుత్తరం చూసి ఎంత పొంగిపోయానో నే చెప్పను. వీడ్నడుగు.

రావు : అవునండి, ఆ వుత్తరం చూసాకే వీర్ని తగలెయ్య – ఇలా అయిపోయారండి.

చలం : లోపలికెళ్ళమని చెప్పానా ? వెళ్ళి ఆ వంట పన్చూదు. శ్యామూ, స్నానం చేసి టిఫిన్ చేస్తావా ? పోని టిఫిన్ తిని స్నానం చేద్దాం, సరేనా ?

రావు : చేద్దాం, చేద్దాం అంటున్నారు బాబూ తవరి స్నానం అయిపోయిందండి.

చలం : ఇంకా నువ్విక్కడే చచ్చావా ?

రావు : చిత్తం – లోపలికెళ్ళి వంట పన్చూడమన్నారేగాని, మరి మామూలు సన్యాసుల వంటా, లేక మరదలుగారొచ్చేరుగదాని ఉప్పుకారం....

చలం : తగిలించు, గట్టిగా తగిలించు. శ్యామూ నీకేకూరలంటే ఇష్టం.

రావు : మరదలొచ్చేసరికి మనుషుల్తోపాటు వంటు గూడా మరిపోతాయన్న మాట.

వెన్నెల : నేనెవరికి మరదల్ని కాను, నన్ను వెళ్ళనివ్వండి.

రావు : అయితే మామూలు వంట వండేస్తానండి.

చలం : అదేంటి శ్యామూ, అంత మాటన్నావ్.

రావు : కోపం వచ్చినట్లుంది. కాస్త దూరంగా ఉండండి.

చలం : నీ డైరెక్షనేవిటి మధ్యలో, అయినా మేమిద్దరం బావా మరదళ్ళం. కొట్టుకుంటాం, తిట్టుకుంటాం. శ్యామూ నేనెవరికి మరదల్ని కానూ అంటుంది. నే బతిమాల్తానూ. నే కోపం తెచ్చుకుంటే శ్యామూ బుజ్జగిస్తుంది, ఇదంతా చెప్పినా నాకర్థం కాదులే.

రావు : ఇదేవిటి బాబూ ఇలా అయిపోయారు . ఎలాంటి మనిషి ! ఎంత నిష్టగా ఉండేవారు ? ప్రతివాళ్ళకి పురాణాలు పసిపిల్లలకి చెప్పినట్లు ....

( అంతలో లోపల్నించి చంటిపిల్లాడి ఏడుపు వినిపించింది )

చలం : అప్పుడే చంటిపిల్లాడి ఏడుపా. రావుడూ – నాకేనా నీగ్గూడా వినిపించిందా ?

రావు : వినిపించినట్లే ఉందండి – అదే అర్థం కావటంలేదు.

చలం : ఇంతకీ ఆ సుబ్బరావయ్యేడి ? ఏమైనట్లు ?

వెన్నెల : సుబ్బరావయ్యా !

రావు : అవునండి – వుదయమే వచ్చారు. గొప్ప తిండి మనిషిలెండి – ఏది కనిపిస్తే అది ఆరగించేస్తారు. ఆ వంటగదిలో అమ్మో...

( ఏదో గుర్తుకొచ్చినట్లు మాట పూర్తి చెయ్యకుండానే లోనికి పరిగెట్టేడు )

చలం : హమ్మయ్యా, శ్యామ్ నువ్వచ్చు మీ అక్కయ్య పోలికే సుమా ! నిన్ను చూస్తుంటే దాన్ని చూస్తున్నట్లే ఉంది. నేనంటే ఎంత ప్రేమో, అందుకే చచ్చి మరదలయి పుట్టింది.

వెన్నెల : చూడండి, నన్ను కాస్త మాట్లాడనిస్తారా, అసలు నేను....

చలం : అండీగిండీ ఏవిటి అసహ్యంగా. నువ్వు మాట్లాడూ, పోట్లాడు, కొట్టూ తిట్టూ, కొరుకు కాని బావా అని మాత్రం మొదలెట్టి మిగతా పన్చూడు. ఇహ నే పులైపోతా.

( అప్పటికే రావుడొచ్చి అక్కడ నిల్చున్నాడు )

రావు : ఇక్కడ మీరు పులైపోయారు. అక్కడాయన పిల్లాడయిపోయాడు.

వెన్నెల : ఏవైంది ?

రావు : ఏం చెప్పమంటారు, ఎలా చెప్పమంటారు, ఏ భాషలో చెప్పమంటారు ?

చలం : ఆ సుబ్బారావయ్యేనా, పప్పులు, ఉప్పులు డబ్బాల్తో సహా తినేసాడా .

రావు : మీ పప్పులు ఉప్పులూ తింటే నే బాధపడేవాడ్ని కానండి. నా లేహ్యం అంతా తినేసాడు.

చలం : లేహ్యమా ?

రావు : అవునండి, మొన్ననో కోయాడు ముసలితనం రాకుండా యౌవ్వన లేహ్యం ఒకటి ఉంది పుచ్చుకుంటావంటే పదికిలోల బియ్యంపోసి ఆ డబ్బా తీసుకుని వంటగదిలో గూట్లో దాచుకున్నా.

చలం : ఆ డబ్బాడు లేహ్యం ఇపుడా సుబ్బరావయ్య తినేశాడంటావ్ అంతేనా ? వాడసలే తిండిపోతు. నిద్దట్లో వున్నపుడు నిన్నూ నన్నూ గూడా తినెయ్యగల్డు. బాధపడక ఇంకో డబ్బా డబ్బులిచ్చి కొనక్కుందూగాని.

రావు : అలాగేనండి, కాని నా భాదంతా ఆ సుబ్బరావయ్య గురించి....

వెన్నెల : ఆయనకేవైంది .

రావు : నే చెప్పలేను, నా వల్లకాదు. అలా తొంగిచూడండి మీకే తెలుస్తుంది.

( అంటుండగానే మళ్ళీ పసిపిల్లాడి ఏడ్పు వినిపించింది. వెంటనే సుబ్బరావయ్య పాక్కుంటూ స్టేజీపైకొచ్చేడు )

మారాం చేస్తున్నట్లుగా కాళ్ళు నేలపై కొట్టుకుంటూ ఏడుస్తున్నాడు )

చలం : వీడ్ని తగలెయ్యా, ఇదేవిటి ఇలా అయిపోయాడు ?

రావు : ఇందాకట్నించి నే మొత్తుకుంటున్నదిదే. యావకొద్దీ మొత్తం తినేసి ఇదిగో ఇలా పసికూనయిపోయేడు.

( వెన్నెల ఇదంతా చూసి కంగారుపడినట్లుగా వెనక్కి రెండడుగులు వేసింది. చలం ఆమెకి ధైర్యం చెపుతున్నట్లు ఆమె భుజాలు పుచ్చుకుని )

చలం : ఏం భయం లేదు శ్యామూ, నేనున్నాగా !

( సుబ్బరావయ్య కాళ్ళు కొట్టుకుంటూ ఏడుస్తున్నాడు )

రావు : పాపం, ఆకలేస్తున్నట్లుంది – పాలు పట్టమంటారా ?

చలం : ఏం పడతావో, ఏం పెడతావో నాకనవసరం. వాణ్ణి లోపలికి తీసికెళ్ళు, నేనూ శ్యామూ చాలా విషయాలు మాట్లాడుకోవాలి.

( తిరిగి ఆమె చెయ్యి పుచ్చుకున్నాడు. సుబ్బరావయ్య మళ్ళీ ఏడ్చేడు. వెంకటాచలం ఆమెని తాకితే ఆ సుబ్బరావయ్య ఏడ్వటం, రావుడు ఒకటి రెండు సార్లు గమనించి )

రావు : అర్ధమైందండి. ఏడుపుక్కారణం ఆకలి కాదండి.

చలం : మరేవిటటా, కడుపు నొప్పా ?

రావు : కాదండి, ఆవేదన, మీరాపిల్ల చెయ్యొదలండి.

( చలం అలాగే ఆమె చెయ్యొదిలి దూరంగా నిల్చున్నాడు. సుబ్బరావయ్య ఏడ్పు మానేశాడు )

చూసేరా , అదీ విషయం ? ఏవిటి ?

రావు : అంటే మీరా పిల్లనిగాని ముట్టుకుంటే, ఈ పిల్లాడు బాధపడతాడు.

మధ్యలో వీడెవడయ్యా, బాధపడటానికి, ఏడ్వటానికీను. పిల్ల వేషాలెయ్యొద్దను.

( రావుడు పిల్లవాడిని పలకరించే ధోరణిలో ఛీ ఛీ అనగా సుబ్బరావయ్య నిండుగా నవ్వేడు )

రావు : బాబు – ఓ అయిదో పదో ఉంటే ఇవ్వండి – బజారెళ్ళి లక్క పిడతలు, బొమ్మలు
తెచ్చి ముందు పడేస్తా – ఆడుకుంటుంటాడు.

చలం : అంటే వీడికిప్పుడు బారసాల, అన్నప్రాసనా చేసి, అడుగులేస్తే అరిసెల పేరంటం
గూడా చెయ్యాలంటవా. నన్నాట్టే విసిగించక. శ్యాం – పద స్నానం చేద్దాం.
( ఆమె చెయ్యి పుచ్చుకోగా, సుబ్బరావయ్య ఏడ్చేడు )

రావు : అనవసరంగా పిల్లాడ్ని ఏడిపించకండి – మీరెళ్ళి స్నానం చేసి రండమ్మా – వెళ్ళండి
( వెన్నెలోనికెళ్ళింది )

చలం : ఇదిగో రావుడూ ఇప్పుడే చెప్తున్నా – శ్యామూ స్నానం చేసొచ్చే సరికి వీడిక్కడే
ఉండటానిక వీల్లేదు. చంకనేసుకుని వీధిలోకి తీసుకెళ్ళు.

రావు : ఆయన్ని నేనేం రమ్మని ఉత్తరం రాసి పిలిపించానా ? నేతెచ్చుకున్న ఆ లేహ్యాన్ని
గోరుమద్దలు చేసి తినిపించేనా – నేనెందుకు తీసికెళ్ళాలండి వీధిలోకి – సర్లేండి –
అలా జాలిగా చూడకండి నాకేడుపోస్తుంది, ‘ టాటా ’ వెడదాం వస్తావా .
( సుబ్బరావయ్య రానన్నట్లు తల అడ్డంగా తిప్పేడు )
రారంటండి – మీరడగండి – పోనీ తాతాగారితో వెడ్తావా ? బోల్డు బొమ్మలు
బిళ్ళలు బిస్కెట్లు కొనిస్తారు వెడ్తావా ? ( వెడతాన్నట్లుగా తలూపేడు )
మీతో అయితే వస్తారంటండి – చూసేరా ?

చలం : నే ఛస్తే వెళ్ళను. అయినా వీడెక్కడ దాపురించాడయ్యా – వచ్చిన వాడు వచ్చినట్లు
ఓ పక్కన తగలడక, ఆ పాపిష్టి లేహ్యం మింగడం ఏవిటి ? ఇలా మారాం
చెయ్యటం ఏవిటి చెప్పు ! ఇప్పుడేవిటి చెయ్యటం !

రావు : ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం ముందు కాస్సేపు పిల్లాడ్ని పట్టుకోండి. నేవెళ్ళి
ఆవిడకేం కావాలో చూసొస్తా

చలం : ఏం అక్కర్లేదు – నువ్వే ఇక్కడుండు – నేవెళ్ళి చూసొస్తా ఆవిడకేం కావాలో !
( సుబ్బరావయ్య ఏడ్చేడు )

రావు : మీరిక్కడే ఉండాలట – పంతంకొద్దీ వెళ్ళేరో మీ వెనకాలే పాక్కుంటూ వచ్చేస్తాడు.

చలం : రాక రాక నా మరదలొస్తే ఈ ప్రారబ్దం ఏవిటి చెప్పు – రావుడూ నీకో పుణ్యం
వుంటుంది వాడ్ని ఏ పార్కుకన్నా తీసికెళ్ళు

రావు : మరి వంటా అదీ...

చలం : ఆ పన్లన్నీ నేచూస్తాగా ....

రావు : మిమ్మల్ని చూస్తుంటే జాలేస్తోంది ఎంతైనా మీ ఉప్పు తిన్నవాడ్ని . మోసం చెయ్యకూడదు. అంచేత నిజం చెప్పేస్తా.

చలం : త్వరగా చెప్పి వాడ్ని బయటికి తీసికెళ్ళు అవతల నా శ్యాంకేం కావాలో చూసుకోవాలి.

రావు : ఆ పిల్ల.... ఆ పిల్ల..... అదేనండి ...ఆపిల్ల...

చలం : ఏ పిల్లరా – నా మరదలా – ఏవిటంటావ్.

( రావుడు చెప్పేలోపుగానే వెన్నెలొచ్చింది )

వెన్నెల : బావా – ఇల్లంతా దేవుడి ఫోటోలోగాని, అక్కయ్య ఫోటో కనిపించదేం – దాచేవా .

( ఆ మాట విని రావుడు నోరు తెరిచేడు – సుబ్బరావయ్య ఏడ్చేడు. చలం ఆనందపడిపోయేడు )

చలం : బావా ! అబ్బ ఎంత కమ్మగా పిల్చేవ్ శ్యామూ – నీక్కావాలంటే అడ్డమైన ఫోటోలు తీసేసి ఇల్లంతా అక్కయ్య ఫోటోలే పెట్టిస్తా గాని – ఏది ఇంకోసారి బావా పిలవ్వా.

వెన్నెల : బావా ...

చలం : శ్యామూ....

వెన్నెల: బావ ....

చలం : శ్యామూ ....

రావు : బాబూ – ఎడ్వాన్సవ్వకండి – అన్యాయం అయ్యిపోతారు. ఇదంతా –దగా, మోసం , కుట్ర....

చలం : ఏవిట్రా ఆ గావుకేకలు. నువ్వుగూడా ఏదన్నా మింగి చచ్చావా.

వెన్నెల : ఏవిటంటాడు ఈ నౌకరు కుర్రాడు. అవును బావా – నే వచ్చాగదా – ఇంకా ఈ నౌకర్లంతా దేనికట – అడ్డం ...

రావు : అమ్మో అమ్మో. బాబూ చెప్పేస్తున్నా వినండి – ఈ పిల్ల మీమరదలు కాదు.

చలం : నీ మరదలా –నీ కుళ్ళు మండిపోనూ, కళ్ళల్లో నిప్పులు పోసుకుని చస్తున్నావ్ శ్యాం

చెప్పినట్లు నాకు నీతో అవుసరం లేదు. నడు బయటికి.

రావు : బాబూ – నా మాట నమ్మండి – ఇదంతా మోసం – ఈ పిల్ల మీ మరదలు శ్యామలకాదు. మోసపోయానండి జాలిపడి ఇలా నాటకం ఆడించేను

( చలం ఆమెవంక అనుమానంగా చూసేడు )

వెన్నెల : ఏవిటి బావా – అంటే వాడిమాటలే నమ్ముతావన్నమాట అలా అయితే సరే

చలం : లేదు శ్యాం – నీ మాట నమ్ముతా – వొట్టు, రెయ్ – ఈ పిల్ల నా మరదలు కాదురా – నా శ్యామల కాదు – అంతేనా...

రావు : ముమ్మాటికి అంతేనండి.

చలం : అయినా ఫర్వాలేదు సర్దుకుంటా కాళ్ళ దగ్గరకొచ్చిన సంబంధం కాశీ వెళ్ళినా దొరకదంటారు.

రావు : అంటే పెళ్ళికూడా చేసేసుకుంటారా ?

వెన్నెల : తప్పకుండా చేసుకుంటా. బావకేం తక్కువని – బోల్డంత ఆస్తుంది. బోల్డంత వయస్సుంది. అనుభవం ఉంది. తన సుఖంకోసం దేశాలు పట్టి తిరిగే మా నాన్న ఈ మాత్రం సంబంధం గూడా తేలేడు నాకు తెల్సు.

( అదే సమయానికి రామలింగం వచ్చేడు. నీరసంగా ఉన్నాడు, కుంటుతున్నాడు, రావుడు రెండు చేతులు వత్తి, గోవిందా గోవిందా అన్నాడు )

రామ : నా పేరు గోవిందా కాదండి రామలింగవండి

( కాని రావుడు ఆ మాట పట్టించుకోక, చలంతో )

రావు : బాబూ నా మాట వినండి. ఆడది మహమ్మారండి.

రామ : బాబూ నా పేరు రామలింగవండి, ఫాదర్ పేరు సోమలింగవండి .....

రావు : బాబూ నే చెప్పేది వినిపించుకోండి.

రమ : ముందు నా మాట వినిపించుకోండి.

( ముగ్గురూ ఒకటి రెండు ప్రదక్షిణాలు చేసారు )

చలం : ( రామలింగంతో ) ఏం నీకూ కళ్ళు కుట్టాయా ? ఈ పిల్ల తనమరదలు కాదని చెప్పటానకొచ్చావా ?

రామ : ఆ విషయం నే చెప్పుతానుగానిండి, ఇందాక మీకొచ్చిన ఆ ఉత్తరం ఇటివ్వండి.

చలం : ఆ ఉత్తరంతో నీకేంపని చచ్చినా ఇవ్వను, అది నా మరదలు రాసింది కదూ శ్యాం

రామ :  మీ మరదలు  బంగారంగానూ నా వొళ్ళు వాచిపోయింది.

రావు : ఏవైంది, అంటే  ఉత్తరాలు

రామ : అదే చెప్పేది రెండు గుమ్మాలవతల అరుణాచలం  అన్చెప్పి  ఓ కుర్రాడున్నాడు.
కొత్తగా పోలీసు డిపార్టుమెంట్లో  చేరాట్ట.....

చలం : అయితే మాత్రం – బావా మరదళ్ళు రాసుకున్న ఉత్తరలన్నీ తీసికెళ్ళి వాడికి
చూపించాలా ?

రామ : అబ్బ....నన్ను  చెప్పనివ్వండి. నాకసలే  వోపికి లేదు. ఆయన  పేరు అరుణాచలం,
వాళ్ళ నాన్న పేరు రమణాచలం. వాళ్ళసలు  వేటపాలెం....

చలం : వాడి పుట్టుపూర్వోత్తరాలు గురించి  నాకెందుగ్గాని , అసలు సంగతి  చెప్పు.

రామ : అబ్బా – మధ్యలో ఆపేరా, ప్చ్ ! మళ్ళీ  చెప్పుకొస్తా, ఆయనపేరు....

రావు : అంటే  ఆ కుర్రాడికొచ్చిన  ఉత్తరం ఇక్కడిచ్చేవా ?
( రామలింగం అవునన్నట్లుగా తలూపగా, చలం జేబులోంచి ఉత్తరం  తీసి చూసి )

చలం : వి.ఎ.చలం అనుంది.

రామ : అంటే వేట అరుణాచలం. అబ్బా వేటాడి పట్టుకుని మామూలిస్తా రమ్మని  తీసికెళ్ళి
మక్కెలిరగ తన్నాడు.

రావు : పోలీసు రిపోర్టు ఇవ్వకపోయావా ?

రామ : అబ్బా, నన్ను కొట్టింది పోలీసు వాడేనయ్యా బాబూ !

చలం : అంటే, శ్యాం అసలు నువ్వు ఉత్తరమే వ్రాయలేదా ?

రావు : బాబూ, ఇంకా అర్ధం కాలేదా ? ఈ ఉత్తరం మీదికాదు. ఈ పిల్ల మీ మరదలూ
కాదు. అంతా దగా, మోసం

వెన్నెల : దగా, మోసం – వెల్ మిస్టర్ రావుడూ, మోసం, దగా ఎక్కడ్లేవు, అవకాశం లేక
పెద్ద మనుషుల్లా  చెలామణి  అయ్యి, సమయం  దొరికితే  అవతారం  మార్చే వీరిది
కాదా మోసం ?
కన్న కూతుర్ని  వయసొస్తే  దాని పెళ్ళిమాట ఎత్తకుండా తన సుఖం  కోసం,
పెళ్ళిమీద  పెళ్ళి చేసుకు దేశాలు పట్టి తిరిగే తండ్రులది కాదా మోసం ?

చలం : ఎవర్ని గురించి నువ్వనేది ?
( సుబ్బరావయ్య లేచి తలొంచుకునిల్చుని )

సుబ్బ : నా గురించి, కడుపున పుట్టిన వాళ్ళ గురించి ఆలోచించని  ఆ కసాయి తండ్రిన్నేనే !

చలం : నువ్వు ఈయన కూతురివా ? నా తో చెప్పలేదే !

సుబ్బ : ఏం చెపుతుంది ! ఎలా చెప్తుంది. పుట్టినపుడు చందమామలా ఉంటే వెన్నెలని పేరుపెట్టేనేగాని, దాని బతుకులో చీకటి నింపేను. చిన్నదానివైనా, నా కళ్ళు తెరిపించావ్ క్షమించమ్మా ! నీ గొంతు విని గుర్తుపట్టి, నీకు మొహం చూపించలేక ఇలా నాటకం ఆడేను. అంతేగాని ఆ లేహ్యం వల్ల కాదు.

చలం : ఏవిటో నాకేం అర్థం కాకుండా ఉంది ఇంతకీ శ్యాం ....మరి.... ఇందాకట్నుంచి...

వెన్నెల : క్షమించండి. మా నాన్న కళ్ళు తెరిపించాలని అలా మాట్లాడేను.

రామ : అందరూ మీలో మీరే మాట్లాడేసుకుంటున్నారు. కాస్త నా గోడు గూడా విని మీ ఉత్తరం తీసుకోండి.

చలం : ఏవిటి నాకు ఉత్తరం ఉందా – ఎక్కడ్నించీ...

రావు : మరదల్నించి మాత్రం అయ్యుండదు. ఏదీ ఆ ఉత్తరం ఇలా ఇయ్యి.

రామ : ఇందులో ఏవుందో ఏమోగాని చదివి పేట్రేగి ప్రాణం తీసేడు.

రావు : ( ఉత్తరం చదివాడు ) పూజ్యులు నాన్నగార్కి నమస్సులు. అమ్మ అబ్దీకం ఇరవై తారీఖున అని వ్రాసేరు. కాని సెలవు దొరకనందు వల్ల రాలేను. మీరే ఇక్కడికొస్తే ఆబ్దీకం జరుపుకుందాం. అన్నట్లు మీకోసం శంకరాచార్యులువారి జీవిత చరిత్ర కొన్నాను. కొత్త ఎడిషన్ వచ్చినపుడు ఇస్తాను. రావుడ్ని అడిగినట్లు చెప్పండి.

**ఇట్లు**

**రాంపండు**

రామ : పెళ్ళి కావాల్సిన కుర్రాడికి ఇలాంటి ఉత్తరం ఇస్తే తవ్వి పాతెయ్యడూ ఇంకానయం. ప్రాణాల్తో వదిలాడు.

చలం : రేయ్ సోమలింగం – ఇన్నేళ్ళ పరువుని బజారున పెట్టేవ్‌గదరా – అడ్రస్సు చూసుకోకుండా అన్యాయం అయిపోయాను.

రామ : పేర్లు మార్చేస్తున్నాండి సోమలింగం నా పేరు కాదండి – మా నాన్నగారి పేరండి.

చలం : నాకు చెప్పొద్దు. అడిగో .....వాడికి చెప్పు...

( సుబ్బరావయ్యను చూపించేడు )

రామ : నా పేరు రామలింగవండి....

( అంటూ అందరివైపు వెడుతున్నాడు. అందరూ తలోవైపుకి కంగారుగా పరుగెట్టేరు. రామలింగం స్టేజంతా తిరిగేడు, వెంకటాచలం కుర్చీ తగిలి క్రిందపడగా, అతడి పక్కన కూలబడి )

రామ : నా పేరు రామలింగవండి, ఫాదర్ పేరు సోమలింగవండి, అసలు మాది అమలాపురం. పిన్ కోడ్ నెంబర్ ....ఫైవ్...త్రీ ....జీరో.....టూ ....వన్.... వెంకటాచలం బరువుగా తల వాల్చేస్తుండగా .....

-------- తెర --------